వైఎస్సార్‌ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

బీచ్‌రోడ్డు : మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌ సీపీ అధినేత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విశాఖ తూర్పు నియోజకవర్గంలో పార్టీ అనుబంధ విభాగాలకు అధ్యక్షులను శనివారం నియమించారు. బీసీ సెల్‌ అధ్యక్షునిగా బేత దుర్గారావు, వలంటీర్‌ వింగ్‌ అధ్యక్షుడిగా మొల్లి వెంకటరమణ, లీగల్‌ సెల్‌కు మొల్లి సింహాద్రి అప్పారావు యాదవ్‌, డాక్టర్స్‌ వింగ్‌కు రాపేటి సన్యాసి నాయుడు, అంగన్‌వాడీ వింగ్‌ అధ్యక్షురాలిగా చందక నూకరత్నంను నియమించారు.

ఘనంగా భూలోకమాత పండగ



పండగలో మువ్వల లక్ష్మి, సురేష్‌ దంపతులు

బీచ్‌రోడ్డు : పెదవాల్తేరులోని భూలోక మాత అమ్మవారి పండగ శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 20వ వార్డు కార్పొరేటర్‌ మువ్వల లక్ష్మి, సురేష్‌ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. గ్రామ ప్రెసిడెంట్‌ బచ్చు తవిటిరెడ్డి, కన్వీనర్‌ పీడింట్ల ప్రసాద్‌, మద్ది వెంకటరమణారెడ్డి, యనమరెడ్డి కుమార్‌ రెడ్డి, మద్ది వెంకన్న, కాగితాల వెంకటరమణ, కాగితాల రవి కిరణ్‌ రెడ్డి, మరడ నాగమణి, పిలక శ్రీనివాస్‌ రెడ్డి పాల్గొన్నారు.

దుర్గాదేవి మండపంలో పూజలు



మొల్లి అప్పారావును సత్కరిస్తున్న నిర్వాహకులు

మద్దిలపాలెం : జీవీఎంసీ 22వ వార్డులోని పీతలవానిపాలెంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపాన్ని వైఎస్సార్‌ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పార్టీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్‌ ఆయనతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం నిర్వాహకులు మొల్లి అప్పారావుకు జ్ఞాపిక అందించి సత్కరించారు.

కృష్ణా కళాశాలలో స్వచ్ఛతా హీ సేవ



మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్‌ విజయబాబు

మద్దిలపాలెం : డాక్టర్‌ వి.ఎస్‌.కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం స్వచ్ఛభారత్‌ మిషన్‌లో భాగంగా స్వచ్ఛతా హీ సేవ ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఐ.విజయబాబు మొక్కలు నాటారు. ఆంధ్రప్రదేశ్‌ గ్రామీణ బ్యాంక్‌ రీజినల్‌ మేనేజర్‌ పి.చిరంజీవి, చీఫ్‌ మేనేజర్‌ దిలీప్‌ శుక్లా, త్రిమూర్తి పాల్గొన్నారు.


ఎన్‌ఈపీ - 2020 అమలులో భాగస్వాములవ్వాలి

ఎంవీపీ కాలనీ : ఎన్‌ఈపీ - 2020 పూర్తిస్థాయి అమలులో ప్రభుత్వం, ప్రైవేట్‌ విద్యాసంస్థలు, విద్యార్థులు భాగస్వాములు కావాలని ఇండియన్‌ మేనేజ్‌మెంట్‌ స్కూల్‌ అసోసియేషన్‌ (ఏయిమ్స్‌) బోర్డ్‌ సభ్యుడు ఆచార్య నారాయణరెడ్డి సూచించారు. ఇండియన్‌ మేనేజ్‌మెంట్‌ స్కూల్‌ అసోసియేషన్‌ ఆంధ్రప్రదేశ్‌ ఛాప్టర్‌తో కలిసి ఎంవీపీ కాలనీలోని ఐఐఏఎం ఎన్‌ఈపీ - 2020 : పాత్‌వేస్‌ ఫర్‌ మేనేజ్‌మెంట్‌ ఎడ్యుకేషన్‌ అంశంపై శనివారం కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య నారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్‌ఈపీ - 2020 మేనేజ్‌మెంట్‌ ఎడ్యుకేషన్‌లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు. ఐఐఏఎం డీన్‌ డాక్టర్‌ సుంకరి రవీంద్ర, ఐఐఏఎం బీస్కూల్‌ డైరెక్టర్‌ జనరల్‌ ఆచార్య కృష్ణమోహన్‌, ఆచార్య విజయభాస్కర్‌, ఆచార్య లజపతిరాయ్‌, ఆచార్య మోహన్‌వెంకటరామ్‌, ఆచార్య కేఎస్‌ చలం, డాక్టర్‌ జి.కృష్ణకుమారి పాల్గొన్నారు.

'కేర్‌'లో రోబోటిక్‌ బైపాస్‌ సర్జరీ విజయవంతం

ఆరిలోవ: హెల్త్‌సిటీలోని కేర్‌ ఆస్పత్రిలో మొట్టమొదటిసారిగా రోబోటిక్‌ సహాయంతో 54 ఏళ్ల వ్యక్తికి కరోనరీ ఆర్టరీ బైపాస్‌ సర్జరీని విజయవంతంగా నిర్వహించారు. ఈ విషయాన్ని క్వాలిటీ కేర్‌ ఇండియా లిమిటెడ్‌ గ్రూప్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ వరుణ్‌ కన్నా శనివారం తెలిపారు. కేర్‌ ఆస్పత్రి చరిత్రలో ఇది చారిత్రాత్మక ఘట్టం అని ఆయన అన్నారు. సాధారణ పరీక్షల్లో రోగికి ట్రిపుల్‌ వెసెల్‌ డిసీజ్‌తో కూడిన కరోనరీ ఆర్టరీ వ్యాధి ఉన్నట్లు కేర్‌ వైద్య బృందం నిర్ధారించింది. అత్యాధునిక డాక్టర్‌ విన్సీ సర్జికల్‌ రోబోట్‌ సహాయంతో రాష్ట్రంలో జరిగిన మొట్టమొదటి శస్త్రచికిత్స ఇదేనని వరుణ్‌ కన్నా వెల్లడించారు. ఈ సందర్భంగా శస్త్రచికిత్స చేసిన వైద్య బృందాన్ని ఆయన అభినందించారు.

దుర్గాదేవికి సీపీ పూజలు



దుర్గాదేవి సన్నిధిలో సీపీ శంకబత్ర బాగ్చి

మద్దిలపాలెం: ఏపీఎస్‌ఈబీ కాలనీలో ఏర్పాటు చేసిన మండపంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవిని శనివారం నగర పోలీసు కమిషనర్‌ శంఖబ్రత బాగ్చి దర్శించుకున్నారు. ఏపీఎస్‌ఈబీ కాలనీ అసోసియేషన్‌ గౌరవ అధ్యక్షుడు ఎం.సింహాద్రి రాజు, చైర్మన్‌ కొండ్రు రామారావు ఆహ్వానం మేరకు సీపీ అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

పాలిథిన్‌ నిషేధం మూణ్నాళ్ల ముచ్చటే!

నిత్య జీవితంలో ప్లాస్టిక్‌ ఓ భాగమైపోయింది. బకెట్లు, డబ్బాలు, కవర్లు ఇలా ఎక్కడ చూసినా ప్లాస్టిక్‌ లేని బతుకును ఊహించడం కాస్త కష్టమే. మరీ ముఖ్యంగా పలుచగా (తక్కువ మైక్రాన్ల) ఉండే పాలిథిన్‌ కవర్ల వాడకంతో పర్యావరణానికి పెను ప్రమాదమని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ నగరంలో విచ్చలవిడిగా వినియోగించేస్తున్నారు. ఈ ఏడాది నుంచి 40 మైక్రాన్ల లోపు ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే దాని అమలు మాత్రం ఆరంభ శూరత్వంగానే మారింది. విశాఖ తూర్పు నియోజకవర్గంలో ప్రస్తుతం ఎక్కడ చూసినా ప్లాస్టిక్‌ వినియోగం విచ్చలవిడిగా కనిపిస్తోంది. ప్లాస్టిక్‌ నిషేధం వైపు ప్రజల అడుగులు ఇంకా పూర్తిస్థాయిలో పడలేదనే చెప్పొచ్చు. ముఖ్యంగా కిరాణా, మాంసాహార దుకాణాలతోపాటు టీ దుకాణాలు, చిన్నచిన్న హోటళ్లలో పూర్తిస్థాయిలో వాటినే వినియోగిస్తున్నారు.





రోడ్డు పక్కన పేరుకుపోయిన పాలిథిన్‌ కవర్లు, ప్లాస్టిక్‌ వ్యర్థాలు

- ప్రకటనలకే జీవీఎంసీ అధికారులు పరిమితం
- నగరంలో పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోని నిషేధం
- కిరాణా, చేపలు, మాంసం దుకాణాల్లో యథేచ్ఛగా వినియోగం
- సాధారణ తనిఖీలు కూడా నిర్వహించని అధికారులు



రోడ్డు పక్కన పేరుకుపోయిన ప్లాస్టిక్‌ వ్యర్థాలు తింటున్న పశువులు



పేరుకుపోయిన పాలిథిన్‌ కవర్లు, ప్లాస్టిక్‌ వ్యర్థాలు

బీచ్‌రోడ్డు : స్వర్ణాంధ్ర సాకారం కావాలంటే.. ముందు స్వచ్ఛాంధ్ర సాధించాలి.. ప్లాస్టిక్‌ బ్యాగ్‌లు, కప్పులు, ప్లేట్లకు గుడ్‌ బై చెబుదాం.. బదులుగా వస్త్ర సంచులు, కంపోస్టు ప్లేట్లు వాడుదాం.. ఆగస్టు 15 నాటికి రాష్ట్ర సచివాలయాన్ని, అక్టోబర్‌ నాటికి అన్ని మున్సిపాలిటీలు, డిసెంబర్‌ నాటికి అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్‌, పాలిథిన్‌ నిషేధాన్ని అమలు చేస్తామంటూ స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. సీఎం పిలుపు మేరకు జిల్లా యంత్రాంగం కూడా ప్లాస్టిక్‌ రహిత సమాజాన్ని స్థాపిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దామంటూ ప్రకటనలు గుప్పిస్తున్నారు. అయితే అవన్నీ ప్రకటనలకే పరిమితమయ్యాయనే విషయం క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే అర్థమవుతుంది. ఎక్కడికక్కడ విచ్చలవిడిగా పాలిథిన్‌ కవర్లు, ప్లాస్టిక్‌ వస్తువులు వాడేస్తున్నారు.

మొక్కుబడిగా అవగాహన కార్యక్రమాలు

కూటమి ప్రభుత్వం పరిసరాల పరిశుభ్రతలో భాగంగా స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తోంది. అయితే ఈ కార్యక్రమాన్ని సంబంధిత అధికారులు మొక్కుబడిగా నిర్వహించి ఫొటోలు తీసుకుని ముగించేస్తున్నారు. ప్లాస్టిక్‌ వస్తువులు, పాలిథిన్‌ సంచులు, గ్లాసులను మార్కెట్లో విచ్చలవిడిగా విక్రయిస్తున్నా కనీస చర్యలు తీసుకోవడం లేదు. ప్రజలకు అవగాహన కల్పించడం లేదు. ఫలితంగా ఉదయం టిఫిన్‌, కూరగాయలు తేవాలన్నా.. ఇంటికి సరకులు తీసుకురావాలన్నా పాలిథిన్‌ కవర్లనే నగరవాసులంతా వినియోగిస్తున్నారు. వాటి వాడకం వల్ల పర్యావరణానికి ముప్పు అని తెలిసినా మారడం లేదు. మరోవైపు ప్రజలు వినియోగించిన పాలిథిన్‌ కవర్లను, మిగిలిపోయిన ఆహారాన్ని ఆ కవర్లతో పడేస్తున్నారు. ఆ ఆహారంతోపాటు కవర్లు తింటున్న పశువులు మృత్యువాత పడుతున్నాయి.

నగరంలో భారీగా పెరుగుతున్న వ్యర్థాలు

పాలిథిన్‌ కవర్లు, నిషేధిత ప్లాస్టిక్‌ వస్తువుల విక్రయాలు విశాఖ తూర్పు నియోజకవర్గంలో ఎక్కడివడితే అక్కడ యథేచ్ఛగా సాగుతున్నాయి. రోజూ సుమారు రెండు నుంచి మూడు టన్నుల వరకూ ప్లాస్టిక్‌ వ్యర్థాలు బయట పడుతున్నట్టు అంచనా. గతంలో 40 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన పాలిథిన్‌ కవర్ల విక్రయాలపై నిషేధం విధించారు. వాటిని విక్రయించిన వ్యాపారులకు అధికారులు నోటీసులు జారీ చేయడంతోపాటు జరిమానాలు విధించారు. దీంతో వాటి వినియోగం అప్పట్లో చాలా వరకూ తగ్గింది. పాలిథిన్‌ కవర్ల వినియోగానికి బదులుగా గుడ్డ సంచులు, నార సంచులు వినియోగించేవారు. తర్వాత అధికారులు పట్టించుకోకపోవడంతో క్రమక్రమంగా ప్లాస్టిక్‌ కవర్ల వినియోగం మళ్లీ పెరిగిపోయింది.

నిబంధనలు పట్టించుకోని వ్యాపారులు

గుడి, బడి, బజారు, కిరాణా షాపు, **హోటళ్లు, మార్కెట్‌** ఇలా ఎక్కడికి వెళ్లినా **పాలిథిన్‌ కవర్లే** దర్శనమిస్తున్నాయి. **వ్యాపారులు కూడా ప్రభుత్వ** నిబంధనలను **పట్టించుకోవడం లేదు**. నియంత్రించాల్సిన **అధికారులు కాసులకి** కక్కుర్తి పడి **పట్టించుకోవడం లేదనే** ఆరోపణలు **వినిపిస్తున్నాయి. బాధ్యులపై** కఠిన చర్యలు **తీసుకుంటామని** హెచ్చరించిన అధికారులు **ఆ దిశగా కనీస** చర్యలు చేపట్టడం లేదని **తెలుస్తోంది. ఇటీవల** కనీస తనిఖీలూ లేవు. **ఎప్పుడో అధికారులకు** గుర్తొచ్చినప్పుడు **చిన్నాచితకా** దుకాణాలపై దాడులు చేసి వారికి జరిమానాలు వేసి, చేతులు దులిపేసుకుంటున్నారు. సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నిషేధం పక్కాగా అమలు చేయాలి



పాలిథిన్‌ నిషేధాన్ని పక్కాగా అమలు చేయాలి. 40 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన వాటిని తయారు చేస్తున్న కంపెనీలతోపాటు విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలి. పాలిథిన్‌ వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతోంది. ప్లాస్టిక్‌ను వినియోగించకుండా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి. అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలి. కింద స్థాయి అధికారులు తనిఖీల పేరుతో వ్యాపారుల వద్ద అందినకాడికి దోచుకుని ప్లాస్టిక్‌ వినియోగం పెంచే విధంగా వ్యవరిస్తున్నారు. అలాంటి వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలి.

– నాయుడు, మద్దిలపాలెం

పాలిథిన్‌ వాడకంతో క్యాన్సర్‌ ముప్పు



పాలిథిన్‌ వాడకం వల్ల క్యాన్సర్‌ బారిన పడాల్సి వస్తుంది. వేడి ఆహార పదార్థాలు ప్లాస్టిక్‌ కవర్లలో ప్యాక్‌ చేయకూడదు. ప్లాస్టిక్‌లోని రసాయనాలు మనిషి శరీరంలో చేరుతాయి. దీంతో పలు రకాల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు ప్రతి ఒక్కరూ గుడ్డ సంచులు తీసుకుని వెళ్లాలి. ప్లాస్టిక్‌ వినియోగంతో పర్యావరణానికి హాని కలుగుతుందని ప్రజలంతా గమనించాలి.

– డాక్టర్‌ విద్యాసాగర్‌, ఆంకాలజిస్ట్‌, విమ్స్‌

ప్రభుత్వ మోసాలపై విస్తృతంగా ప్రచారం



18వ వార్డులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌ సీపీ నాయకులు కల్యాణ్‌, తదితరులు

ఎంవీపీ కాలనీ : వైఎస్సార్‌సీపీ చేపట్టిన బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం 18వ వార్డు అంజయ్యనగర్‌లో శనివారం కొనసాగింది. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయలేదని, మోసం చేసిన పాలకులను నిలదీయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ మోసాలపై విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పార్టీ వార్డు అధ్యక్షుడు ఉమ్మిడి కల్యాణ్‌ మాట్లాడుతూ అబద్ధపు హామీలతో కూటమి నాయకులు 2024 ఎన్నికల్లో గద్దెనెక్కారన్నారు. ఏడాదిన్నర పాలనలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం మోసాలపై ఆ పార్టీ నాయకులను ప్రజలంతా నిలదీయాలన్నారు. ఈ మేరకు ప్రజల్లో చైతన్యం నింపేందుకే బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ చేపట్టిందన్నారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు ఎల్లాజీ, వార్డు మహిళ విభాగం అధ్యక్షురాలు గరికిన ధనలక్ష్మి, బీఎల్‌ఏ కె.రవితేజ, ఫిషర్మెన్‌ సొసైటీ అధ్యక్షుడు మారుపల్లి పరదేశి, సురేష్‌, అప్పలరాజు, ఈశ్వరరావు, రాజేష్‌ తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి స్కూల్‌ గేమ్స్‌ పోటీలు

ఆరిలోవ : జిల్లాలో స్కూల్‌ గేమ్స్‌ పోటీలు అక్టోబర్‌ 3 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్లు డీఈవో ఎన్‌.ప్రేమకుమార్‌ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025 – 26 విద్యా సంవత్సరంలో 56 క్రీడలకు సంబంధించిన పోటీలు జరగనున్నాయన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌, అథ్లెటిక్స్‌, చెస్‌, యోగా, బ్యాడ్మింటన్‌ క్రీడలు మండల, డివిజనల్‌, జిల్లా స్థాయిలో జరుగుతాయన్నారు. మిగిలిన 49 క్రీడలు జిల్లా స్థాయిలో జరుగుతాయని తెలిపారు. ఈ పోటీలకు అండర్‌ – 11 కేటగిరీలో 3 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు (కేవలం స్కేటింగ్‌లో మాత్రమే పాల్గొనుటకు) అర్హులన్నారు. అండర్‌ – 14, అండర్‌ – 17 కేటగిరీల్లో 6 నుంచి ఇంటర్మీడియట్‌ రెండో సంవత్సరం వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఈ క్రీడలు స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆఫ్‌ ఆంధ్రప్రదేశ్‌ ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు.

ఉద్యాన శాఖ రాయితీలను వినియోగించుకోవాలి

ఎంవీపీ కాలనీ : జిల్లా ఉద్యాన శాఖ ద్వారా అందిస్తున్న రాయితీలపై ఆ శాఖ అధికారి భాను ఎంవీపీ రైతు బజార్‌లోని రైతులకు అవగాహన కల్పించారు. ఎంవీపీ రైతు బజార్‌లో శనివారం ఆమె రైతులతో సమావేశమయ్యారు. అక్టోబర్‌ 10లోపు రైతులంతా ఈ క్రాప్‌ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఇందుకు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలన్నారు. డ్రిప్పు, విత్తనాలు, పంటలకు ఉద్యానశాఖ ద్వారా అందిస్తున్న రాయితీలను వినియోగించుకోవాలన్నారు. సబ్జీ కూలర్ల వినియోగంపై రైతుల నుంచి ఆరా తీశారు. కార్యక్రమంలో ఈవో వరహాలు, సహాయకుడు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణం త్వరగా పూర్తిచేయండి

మద్దిలపాలెం : ఇసుకతోట పెట్రోల్‌ బంక్‌ వద్ద నిర్మిస్తున్న కల్వర్టు పనులను త్వరగా పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్‌ కేతన్‌ గార్గ్‌ ఇంజినీరింగ్‌ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన ఇసుకతోట జంక్షన్‌ పెట్రోల్‌ బంక్‌ వద్ద నిర్మిస్తున్న కల్వర్టు పనులను పరిశీలించారు. జాతీయ రహదారి పక్కన కావడంతో ప్రజలు, వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయని, అలాంటి చోట పనులు ఎందుకు మందకొడిగా సాగిస్తున్నారని ప్రశ్నించారు. పనులు వేగవంతం చేయాలని కార్యనిర్వాహక ఇంజినీరు గంగాధర్‌ను ఆదేశించారు. మురుగు నీరు సాఫీగా పోయే విధంగా, వర్షాలు కురిసినప్పుడు అడ్డంకులు లేకుండా నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. జెడ్సీ కె.శివప్రసాద్‌, ఉపకార్యనిర్వాహక ఇంజినీరు నాయుడు, సహాయక ఇంజినీరు, తదితరులు పాల్గొన్నారు.



ఇసుకతోట వద్ద కల్వర్టు పనులు పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్‌ కేతన్‌గార్గ్‌, అధికారులు

దుర్గాదేవి ఉత్సవాల్లో అన్నసమారాధనలు

ఆరిలోవ : జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి శివాజీనగర్‌లో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శివాజీనగర్‌ యూత్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో శనివారం అన్నసమారాధనను వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు సత్యాల వెంకట్‌, కె.శిరీష, ప్రసంగి వాసు, అప్పలనాయుడు, బంగార్రాజు, బేబి, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

మద్దిలపాలెం : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 16వ వార్డులోని కేఆర్‌ఎం కాలనీలో శనివారం అన్నదానం ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. శిరీష, మీసాల ప్రదీప్‌, నిరంజన్‌, పార్వతి, జ్యోతి, ధనలక్ష్మి, మధుసూధనరెడ్డి, రాజు, కిరణ్‌, నిశాంత్‌, తేజ, రమణ, రఘు, అభి, లోకేష్‌, వినయ్‌, రాకేష్‌, వైకుంఠ, యశ్వంత్‌ పాల్గొన్నారు.



శివాజీనగర్‌లో అన్నప్రసాదం వడ్డిస్తున్న మొల్లి అప్పారావు, తదితరులు

11 మంది పందెంరాయుళ్ల అరెస్ట్‌

ఎంవీపీ కాలనీ : మద్దిలపాలెం చైతన్య నగర్‌లో కోడి పందాలు ఆడుతున్న 11 మంది పందెంరాయుళ్లను టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు అరెస్ట్‌ చేశారు. ఈ ఘటనపై ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మద్దిలపాలెం చైతన్యనగర్‌లో కొంత మంది గ్రూప్‌గా ఏర్పడి కోడిపందాలు ఆడుతున్నారు. దీనిపై నగర టాస్క్‌ఫోర్స్‌ పోలీసులకు అందిన సమాచారం మేరకు ఆకస్మిక దాడులు చేసి 11 మందిని అరెస్ట్‌ చేశారు. 4 కోళ్లు, 5,180 నగదును స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు బదిలీ చేయడంతో ఎంవీపీ లా అండ్‌ ఆర్డర్‌ పోలీసులు కేసు నమోదు చేశారు.

అపెండిక్స్‌ కణితికి అరుదైన శస్త్రచికిత్స

ఆరిలోవ : హెల్త్‌సిటీలోని వృందా క్యాన్సర్‌ ఆస్పత్రిలో అపెండిక్స్‌లో ఏర్పడిన కణితి తొలగించడానికి అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్లు ఆస్పత్రి అంకాలజీ వైద్య నిపుణుడు డాక్టర్‌ వంశీధర పుట్రేవ్‌ తెలిపారు. ఆస్పత్రిలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. విజయనగరం జిల్లా రాజాం ప్రాంతానికి చెందిన ఉపాధ్యాయుడు శాంతారావుకు పొట్టలో నొప్పి రావడంతో వైద్య పరీక్షలు జరిపించి జిగురు లాంటి ద్రవంతోపాటు అపెండిక్స్‌లో కణితి ఉన్నట్లు గుర్తించామన్నారు. దీన్ని ప్స్యూడోమెక్సోమా పెరిటోని వ్యాధిగా పిలుస్తారన్నారు. దీనికి శస్త్ర చికిత్స చేయడానికి సుమారు 10 గంటలు పట్టిందన్నారు. ఇలాంటి సర్జరీలకు హైదరాబాద్‌, బెంగుళూరు, చెన్నై తదితర పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా విశాఖలోనే అధునాతనమైన నైపుణ్యం అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో శస్త్ర చికిత్స వైద్య బృందం డాక్టర్‌ అప్పలనాయుడు, డాక్టర్‌ హరికృష్ణ, నర్సింగ్‌ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్య నిపుణుడు వంశీధర